# ఈగలు

శ్రీ డి. ప్రభాకర్

(గత సంచిక తరువాయి)

అదిగో పెంకుటిల్లు. ఆ పెంకుటింటికి పెంకుటిల్లులానే వుండటం యిష్టం కాబోలు! దాన్ని పడగొట్టి మేడ కట్టేద్దామన్న ఆ యింటి యజమాని ప్రయత్నాలన్నీ ప్రయత్నాలుగానే వుండిపోతున్నై. ప్రస్తుతం ఆయింట్లో మూడు యిష్టాలుంటున్నై. అవి సుజాతవి, సుభద్రవి, యింట్లో వాళ్లకి పెద్దబ్బాయ్, బయటివాళ్లకుడాక్టరూ అయిన సుబ్బారావ్వీను. సుజాత సుభద్రకి ఆడబిడ్డైతే సుభద్ర సుబ్బారావ్‌కి పెళ్లామవుతుంది!

ఉన్న నలుగురు కొడుకులూ ఎవడిజీతం వాడు ఖర్చుపెట్టుకుని తిండికోసం తండ్రిమీద ఆధారపడినట్టు ఆ పెంకుటింట్లోవున్న గదుల్లో ఓ గదిని సుజాతా, ఓ గదిని సుభద్రా సుబ్బారావూ 'మావి' అనుకుని మిగిలినవాటిని 'మనవి'గా చేసుకుని వుంటున్నారు.

ప్రస్తుతం సుజాత తవగదిలో మంచంమీద బోర్లాపడుకుని రేపొచ్చే సినిమానా? ఎల్లుండొచ్చే పరీక్షా? – ఏది ముఖ్యం?? అని సీరియస్‌గా ఆలోచిస్తోంది (డబ్బులేన్నవుగాని ఆ సమస్యమీద ఓ సినిమా తీసుండును).

సుభద్ర హాల్లోకూచుని గళేబుమీద గులాబి కుడ్తూ వూరికే వాకిటివేపు చూస్తోంది—పట్నం పోయిన నాన్న ఎప్పుడొస్తాడో ఏం తెస్తాడో అని ఆశగా ఎదురుచూసే చిన్నారిలా.

సుభద్ర అలా చూడగా చూడగా వీధి తలుపులు మ్రోగి, తెరుచుకుంటూ మ్రోగి ఆగిపోయిన్నై. సుబ్బారావ్ వీధిలోంచే నవ్వుతూ లోపలి కొచ్చేడు.

సుభద్ర సుబ్బారావుని చూస్తూనే నవ్వుతూ లేచినిలబడి 'ఏవిటివాళ యింత ఆలస్యమైంది' అంది. అంటూనే అతనిమించి వాకిట్లోకి చూసింది.

'అర్జంటు కేసొకటొచ్చింది గానీ ఏవిటీ నువ్వింకా అటే చూస్తున్నావ్?'

'ఆ...రిక్షావాడు బాయిలర్ పట్టుకొస్తున్నాడేమోనని!'

సుబ్బారావు చిన్నతనంనుండి చొక్కాలు సొంతగానే తొడుక్కుంటున్నాడు—విప్పుతున్నాడు. అయినా ఆక్షణంలో, సుభద్ర బాయిలర్ ప్రసక్తిని ఆసక్తిగా తెచ్చిన సమయంలో షర్టు విప్పటం యెల్లానో చేతకానివాడిలా ఆగిపోయేడు. ఆ క్షణంలోనే అతడి ముఖం 'తెలుపు'కు వ్యతిరేకపదం చెప్తున్నదాన్లా నల్లగా అయిపోయింది. ఆ తర్వాత క్షణాల్లో అతగాడు చావుకబురు చెప్పాల్సొచ్చినవాడిలా బుర్రగోక్కుని అన్నాడు—

'సారీ సుభా! ఓ నూటయాభై రూపాయిలు అర్జంటుగా కావాలని నాన్నగారు టెలిగ్రాం యిచ్చేరు. ఆడబ్బు అటు పంపటంతో బాయిలర్ కొన్లేకపోయేను!'.

సుభద్ర కప్పుడప్పుడు కోపమొస్తుంది. ఏడుపుకూడా వస్తుంది. కాని యిప్పుడు సుబ్బారావు మాటలు విన్నప్పుడు అవి రెండూ కలిసొచ్చిన్నై. కళ్లలోంచొచ్చిన్నై.

సుబ్బారావ్ సుభద్రని చూసేడు. న్యాయం జరుగుతుందని ఆశపడ్డ ముద్దాయికి అన్యాయం ఎదురైనప్పుడు అతడి కళ్లెలా వుంటాయో సరిగ్గా

అల్లాగేవున్న సుభద్ర కళ్ల మ్మాపేశు. అంచేత యేదో కొనిపెడ్తానని ఆశపెట్టి యేమీ కొనిపెట్ట(లే)ని తండ్రి కొడుకును (లేపోతే కూతుర్ని) అనున యించినట్టు అనునయించాడు సుభద్రని—

'ఏం చేస్తాం సుభా! ప్రతిసారీలావే ఈసారీ కూడా బాయిలర్ కొన్లేకపోయేం. వచ్చేనెల్లో ఏమైనా సరే తప్పక కొందాంగా!'

'ఇప్పటి కిల్లాటి నెలసరి వాయిదాలు పద్దై పోయిన్నై. ఇంకా యెందుకూ వచ్చేనెల వచ్చేనెల అని వూరిస్తారు. ఏకంగా వచ్చే సంవత్సరానికి వాయిదా వెయ్యండి. రేపామాపా అని ఎదురు చూట్టమైనా తప్పుతుంది!'

'అది కాదోయ్ సుభా, యీ నెల కొందామంటే నాన్నగారి దగ్గర్నుండి ఉత్తిగామొచ్చిందయె! పోయిన్నెల్లో తమ్ముడికి ఎగ్జామినేషన్ ఫీజు కట్టాల్సొచ్చే. ఆ పోయిన్నెల్లో......'

'ఇప్పుడ్నాకె దుకా పంజాయితీలన్నీ. మీడబ్బు. మీయిష్టం. మీ యిష్టమొచ్చినట్టు చేసుకోండి. మధ్య నాకెందుకీ గోల!'

'అందుకే నాకు వళ్లు మండేది. ఇప్పుడే మయిందని ఆ కోపతాపాలు? మనిషనేవాడికి బాయిల ర్లొక్కటే కాదు అవసరం యింకా చాలా వుంటై. నోట్లోమాట నోట్లో వుండగనే కొట్లో సరుకులు ఇంట్లోకి రావాలంటే మనమేమన్నా మహారాజులమా! అయినా బాయిలర్ లేకపోతే కొంపేం మునిగిపోదు. చేతనైతే వున్నవాటితోనే నీళ్లుకాయి. లేపోతే ఆ వన్నీళ్లే తగలెయ్. ఆమాత్రం దానికేదో పేద్ద రాద్ధాంతం చేస్తావేమిటి ?'

పంచప్రాణాలు పై చదువులమీద వున్నప్పటికీ చదువు చెప్పించలేని అమ్మానాన్నల పట్టుదలవల్ల ముసలివాడికి మూడో పెళ్లాంగా వెళ్లాల్సొచ్చిన కన్నె పిల్లలా ఏడ్చేసింది సుభద్ర. ఏడుస్తూ మొగుడి కెదురుగా నుంచుంటే అతగాడు మరింత రెచ్చి పోయి 'ఏవిటా ఏడుపు మొహం ఫో లోపలికి' అని కసుర్తాడనీ, కరుస్తాడనీ భయపడినదాన్లా లోపలికి వెళ్లిపోయింది? వంటిట్లోని వేణ్ణీళ్లు తీసికెళ్లి, పెరట్లోపెట్టి మళ్లీ వంటింట్లోకొచ్చి, 'నీళ్లు తోడాను' అని అరచింది—నచ్చని ఆఫీసరు దగ్గర పనిచేస్తున్న నౌకరులా.

సుబ్బారావ్వెళ్లి స్నానం చేసొచ్చేలోపల కంచంలో అన్నం వడ్డించి అతడు హాల్లోకి వెళ్లగనే తను పెరట్లోకి వెళ్లి 'భోజనం' అని కేకేసింది.

సుబ్బారావ్వెళ్లి భోజనం ముందు కూచు న్నాడు—అప్పుడే శవంముందు శోకతప్తుడై వున్న వాడు పెద్దల బలవంతంమీద వెళ్లి భోజనంముందు కూచున్నట్టు కూచున్నాడు. కూచున్న అతడికి పెర ట్లోంచి గాజుల గలగలలు వినిపించినై. అయితే అవి శృంగార సంగతులూ, సంగీతాలూ వినిపించటంలేదు— నీళ్లు నిండుతున్న కళ్లని ముక్కునూ వూరికే ఒదారు స్తూన్న చేతికి సానుభూతిగా 'చ్చొచ్చొచ్చొ' అంటున్నై. అది విన్నాక సుబ్బారావుకి జాలేసింది. అంచేత నిరపరాధికి ఉరిశిక్షవేసిన జడ్జీలా బాధ పడ్డాడు. అందుచేతనే ఉరికంబం ఎక్కిన నిర్దోషిని గుర్తుకు తెచ్చుకున్న జడ్జీలా అన్నం (సయించక) వదిలేసి లేచి వెళ్లిపోయేడు.

అతడువెళ్లిపోయిన కాస్సేపటికి సుభద్రవచ్చి, వంటిల్లు సర్ది మరచెంబుతో మంచినీళ్లు త్రాగి మరచెంబులో నీళ్లు తీసుకుని గదిలోకివెళ్లింది.

పగవాడి యిల్లు తగలడ్తోందని ఆనందించి, చివరికి లబోదిబో మంటున్న పగవాణ్ణిచూసి ఆనం దించలేక జాలిపడి పగమరచి ఓదార్చబోయిన పెద్ద మనిషిలా సుబ్బారావ్ గదిలోకొచ్చిన సుభద్రను చూసి అప్పుడే హనీమూన్‌కి బయల్దేరబోతున్న వాడిలా కులాసాగా అన్నాడు—

'ఏం దేవిగారు యివాళ పెందరాడే దయ చేశారు'

'దేవుణ్ణో వరం అడుగుదామని!'—చింత బరి కతో చావబాదిన మాష్టారితో మాట్లాడాల్సొచ్చిన విద్యార్థి (ని) లా అంది సుభద్ర.

'ఏమిటి కొంపతీసి చీరెగాని కొన్నావా?'

'ఊ! అదొక్కటే తక్కువ!'—సుభద్ర వెళ్లి పోబోయింది.

'అరె...ఆగవోయ్ (సుబ్బారావు సుభద్రను చేయిపుచ్చుకుని ఆపి తన మంచంమీద కూచో బెట్టేను) వూ...ఇప్పుడుచెప్పు సంగతేమిటో'

'.........................'

'అదేమిటోయ్ యింతవరకూ కోపంగా వున్నావ్. అంతలోనే సిగ్గుపడి పోతున్నావ్. కథేమన్నా రాసేవా?'

సుభద్ర నవ్వీనవ్వనట్టునవ్వి సుబ్బారావ్‌ని చూసీ చూడ్నట్టు చూసింది.

'చెప్పు మరీ!'

'మరీ...మరీ...నేను...కాదు... మీరు ...కాదు మనం.. అమ్మా నాన్నా కాబోతున్నాం!'

'నిజంగా! హార్టీకంగ్రాట్స్!!' రాజ్యాలు జయించిన మహారాజులా ఆనందపడి పోయేడు సుబ్బారావ్. విజయవార్త మోసుకొచ్చిన భటుణ్ణి మహారాజా వూపేసినట్టు సుభద్రని పట్టుకుని కుదిపేశాడు.

'అబ్బ! ఏమిటిది...అరే...వదలమంటుంటే...' సుభద్ర విడిపించుకుని దూరంగా నిలబడింది.

సుబ్బారావు 'తొక్కుళ్లాట' ఆడుతున్నవాళ్లా వుత్సాహంగా సుభద్రపక్కకి చేరేడు.

'చెప్పు డియర్. నీకేం కావాలో! నిమిషాలమీద, కాదు క్షణాలమీద ప్రెజెంట్ చేస్తాను!'

'బాబు పుడ్తాడని మీకింత సంతోషంగా వుంటేగాని నాకల్లాటి దేమాత్రమూ లేదు!'

'ఏం! పాప పుడ్తుందేమోనని బెంగెట్టు కున్నావా?'

'లేదు! పిల్లలు పుడ్తున్నారని దిగులు పడు తున్నాను!!'

'సుభద్రా!!'

'అవునండీ! మీరుగనక యే రావూబహద్దూర్ గారింట్లోనో, మినిష్టరో వారి బంధువులింట్లోనో పుట్టివుంటే వెనుక తరగని ఆస్తితో, ముందు వడ్డించిన విస్తరితో పరువులజీవితం అనుభవిస్తూ వుండే వారు. వెనకొచ్చినదాన్ని అన్ని విలాసాలకూ ఖర్చు చేసుకుంటూ ముందొచ్చే జీతాన్ని కేవలం సిగరెట్లకి కేటాయించి హాయిగా నౌకరు కాలుమీద మీకాలు వేసి బ్రతగ్గలిగేవారు. కాని మీరు పుట్టింది--కాదు—మిమ్మల్ని కన్నది గుప్పెడు బియ్యంకోసం రాగిచెంబు తీసుకుని కాళ్లరగతిరిగే కృష్ణయ్య పంతులుగారు. ఆయన మిమ్మల్ని చూసుకుని మీరు యిప్పుడు ఆనందిస్తున్న దానికంటే యెక్కువే ఆనందించి వుంటారు. మీరు యిప్పుడు మీరాబోయే సుపుత్రుడి వున్నతిగురించి వూహించిన దానికంటే ఎక్కువే వూహించివుంటారు. అయినా ఆయన మీకివ్వ గలిగిం దేమిటి?—డబ్బు అవసరమైందంటూ అడపా దడపా ఉత్తరాలు! మీరు పుచ్చుకోగలిగిం దేమిటి?—మీ నాయన చేస్తున్నఅప్పులు తీరుస్తున్నట్టు నెల్నెలా ఓ రసీదుముక్క! రేపు మనమూ అంతే! మనకు పుట్టుకొచ్చే పిల్లలకు మనం పేర్చి యివ్వగలగేవి అవే!!'

'మరీ అన్యాయంగా మాట్లాడకు సుభా! మా నాన్న నాకు ఆస్తిపాస్తులేవీ యివ్వలేకపోయినా అప్పోసొప్పోచేసి లక్షణంగా చదువు చెప్పించేడు. డాక్టర్ని చేసేడు!'

'నిజమేనండి! మీరు డాక్టరయేరు. దేశంలో బాగా చదువుకున్న చాలామందికంటే కొద్దో గొప్పో ఎక్కువే సంపాదిస్తున్నారు. కాని మీరు యేం సాధించ గలిగేరు? అద్దెకొంపా, అద్దె ఫర్నిచరూ, వాయిదాల మీద రేడియో, ఫానూ, పాతగుడ్డలకొచ్చే స్టీలు సామానూ...యింతేగా!'

'సుభద్రా! డాక్టరనగానే తెల్లచొక్కా, లెక్క లేనంత డబ్బూ, చిక్కుల్లేని బ్రతుకూ అని నోరూరేలా అనుకునే వాళ్లల్లోని దానివి కావను

కున్నాను. నాజీతాన్ని, నా చుట్టూవున్న జీవితాల్ని వాటి సమస్యల్ని సమంగా బేరీజు వేసుకోగల సామర్థ్యంవున్న యిల్లాలి ననుకున్నాను. కానీ......'

'తెలుసండీ! నాకంతా తెలుసు! ఒకటో తారీఖున ఒకేఒక మార్గంగుండా వచ్చే ఏడొందల జీతపురాళ్లు రెండోతారీఖు...రెండో తారీఖొచ్చేసరికి రెండొందల మార్గాలగుండా ఎగిరి పోతున్నాయని తెలుసు!'

'అవి ఎగిరి పోయేదెక్కడికో కూడా నీకు తెలుసు!'

'తెలీకేం! మెడ్రాస్‌లో చదువుతున్న మీ తమ్ముడు సుందరంకి నెల్నెలా నూటయాభై పంపుతున్నారని తెల్సు. మీ అమ్మా నాన్నలకి వాళ్లతో వుంటున్న మీ చిన్నతమ్ముడి ఖర్చులకి కలిపి రెండొందలు పంపుతున్నారని తెలుసు. మిగిలిందాంట్లో డెబ్భై రూపాయలు ఈకొంప మింగుతుందని, మీ చదువుకి చేసినఅప్పు, మీ అమ్మ జబ్బుపడ్డప్పుడు తీసుకున్నబదుళ్లూ, మీ నాయనమ్మ ఋణం తీర్చుకుందుకు మీరుచేసిన ఋణం యిప్పట్లో తీరేవిగావని తెలుసు. ఇక మిగిలిన రెండొందల యాభైలో యిక్కడ మనం ముగ్గురం సర్దుకుపోతున్నామనీ తెల్సు!!'

'ఇన్ని తెలిసుండి నన్ను ఇబ్బంది పెడుతున్నావా?'

'మిమ్మల్ని యిబ్బంది పెట్టాలని కాదు. ఈ పరిస్థితుల్లో పిల్లల్ని కనటమంటే వాళ్లను యిబ్బంది పెట్టటానికే నంటున్నాను!'

'అయితే ఏవిటి నువ్వనేది? ఇప్పుడు నన్ను వెళ్లి ఆపరేషన్ చేయించుకో మంటావా?? నువ్వు 'ఎబార్షన్' చేయించు కుంటావా??'—సుబ్బారావుకి సుభద్రవైఖరి చిరాకెత్తించి నట్లుంది. శివమెత్తి నట్టు మాటాడేడు.

సుబ్బారావు మాటలకి సుభద్ర కెవ్వుమంది! చేతిలోని చేంతాడు చేతిలావు త్రాచై కాటేసినట్లు ఘొల్లుమంది. శిక్ష తప్పదనుకున్న ముద్దాయ్ కోర్టునీ, కోర్టులోని జడ్జిని, జడ్జి ముందుండే వకీళ్లని దులిపేసినట్టు సుబ్బారావ్‌ని దులిపేసింది—

'ఎంత క్రూరంగా మాటాడుతున్నారండీ మీరు! పిల్లల్ని కనటమే ఓ వరంగా భావించే ఆడదాన్ని, తొలిబిడ్డకోసం ఆరాటపడుతున్న దాన్ని, నన్ను ఎబార్షన్ చేయించుకోమంటారా. ఛీ...ఛీ...మనుషులేనా మీరు?'

సుబ్బారావ్ బిత్తరపోయేడు. నోటమాట రాదనుకుని నోరు తెరిచేడు. కాని నోటమాట లొచ్చినై—

'ఆడదంటే అర్థం కానిదని పుస్తకాల్లో చదువుకున్నాను గాని యింతవరకు చూళ్లేదు. యిప్పుడే...నీలో చూస్తున్నాను! రెండు నిమిషాల ముందు పిల్లల్ని కనటం వాళ్లని కష్టపెట్టటానికే అన్నదానివి యిప్పుడు...'

'అన్నాను. అంటే పుట్టేవాళ్లకి పురుట్లోనే సంధి కొట్టించమనా అర్థం! ఇంతకు ముందెలాగో జరిగిపోయింది యిహనైనా రాబోయే వాళ్లకోసం మనం మురిసిపోవటమే కాకుండా వాళ్ల ముద్దూ మురిపేలు తీర్చటంకోసం ముందు జాగ్రత్త అవసరమని అర్థంకాదా? వెనకటి కెవరో నాబోటావిడ వ్రతకథల్తోపాటు గాంధీగారి లెంపకాయ కథలు కూడా భట్టీయం వేసిందిట. అవి వంటబట్టేసరికి గాంధీగార్లా అతిమంచి మనిషినై పోదామని తాగొచ్చిన మొగుడు నిష్కారణంగా వో చెంప ఛెళ్లుమనిపించినప్పుడు పళ్లున్న గాంధీగార్లా నవ్వుతూ రెండో చెంప అందించిందట. అతగాడు అంచక్కా ఆరెండో దవడకూడా వాతలు పొంగేలా వాయించి మరీ పోయేట్ట. అలా వుంది నా పరిస్థితి. పిల్లలు పుట్టుకొస్తున్నారు జాగ్రత్త అంటే వాళ్ల పీకల్నులిమెయ్యమంటున్నారు దయార్ద్రహృదయులు!!'

'లాభం లేదు సుభద్రా, నువ్ మనసులో ఒకటుంచుకుని పైకొకటి మాట్లాడుతున్నావ్.

నీ వాలకం చూస్తుంటే నా జీతమంతా పరోపకారానికి తగలేసి పిల్లలకి కనీసం కారపు మెతుకులు గూడా మిగల్చలేనేమోనన్న భయం, బాధా కన్పిస్తున్నై. అదే నిజమైతే సుభద్రా—చెప్పు—యీ ప్రపంచంలో ఎన్ని కష్టాలైనా పడి కన్నబిడ్డల్ని పోషించాలన్న రూలుందిగాని కష్టాల్లోవున్న తల్లిదండ్రుల్ని ఎదిగొచ్చిన పిల్లలు ఆదుకోవాలన్న రూలెక్కడా లేదుగా! అంచేత అడ్డొచ్చిన వాళ్లని గోడవతల నిలబెడ్దాం. వాళ్ల గొడవే వదిలేద్దాం! మన సుఖంవూ, మన బిడ్డల సుఖంవూ చూచుకుందాం! ఇప్పుడు చెప్పు. సుందరానికి డబ్బు పంపటం మానెయ్యమంటావా? అమ్మ వాళ్లకి పైకం పంపొద్దంటావా?? బేబీని అమ్మ దగ్గరకు పంపెయ్యమంటావా??? చెప్పు సుభద్రా ఏం చెయ్యమంటావో చెప్పు!'—సుబ్బారావ్ ఆవేశంతో వూగిపోయేడు.

సుభద్ర నెత్తురు మడుగుని చూసినట్టు చలించిపోయింది. ఆఫ్టరాల్ పిల్లిపిల్లేగదా అని గది తలుపులు మూసి కర్రుచ్చుకు కొట్టబోతే అది కాస్తా ఎదురు తిరిగి మీదపడ్డట్టు భయపడిపోయింది. చివరికి కంపిత స్వరంతో అంది—

'అయ్యో ఆ పాపం నా కెందుకండీ!'

'మ రేపాపం కావాలి?'

'డబ్బు ఖర్చయే మార్గాలు ఎక్కువైనప్పుడు డబ్బొచ్చే మార్గాన్ని విశాలం చేసుకోవటమే పాపమైతే—ఆ పాపం కావాలి! నాక్కాదు—మీక్కాదు—మన కుటుంబానికి కావాలి!!'

'అంటె...లంచం తీసుకోమంటావా?'

'తీసుకుంటే తప్పేం లేదంటాను!'

'నువ్వనొచ్చు! కాని నేననను. గవర్నమెంటు అనదు. రూల్సు అనవు సరిగదా యీళ్లకర్రలై నెత్తిన మొటి గళ్లచొక్కాతొడిగి కటకటాల వెనక నుంచోబెడతై!'

'ఆ నుంచోబెడతై — కంసుణ్ణి అతల్లాటి రాక్షసుల్నిగాదు. శ్రీ కృష్ణుల్ని వాళ్లమ్మా నాన్నల్లాటి మెమ్మెమ్మేలని! అసలు రూల్సన్నాసి గూడ్సుబండిలా (భయపడి) ఆగిపోయేవాళ్లకే యివన్నీను. ఏ భయంలేనివాళ్లకి ధనలక్ష్మి ఎప్పుడూ అభయం యిస్తూనే వుంటుంది. కావాలంటే మీ హాస్పిటల్లోనే పన్చేస్తున్న కంపౌండర్ని చూడండి—మొన్న స్థలం కొన్నాడు. నిన్న యిల్లు కట్టేడు. యివాళ 'కాంపౌండ్‌వాల్' కట్టిస్తున్నాడు! రేపు లోపల తోటవేసి అందులో, అతగాడి పెళ్లాంపిల్లల కళ్లు మెరిసేలా, అద్దెకొంపలవాళ్ల పళ్లుపులిసేలా షికారు చేస్తాడు. మరి అతడివన్నీ తనకొచ్చే నెల జీతంతోనే చేయగలుగుతున్నాడా? లేదండీ! ఆస్పత్రిలో కంపౌండరుగా వుండి యింటిదగ్గరా, యింటింటిదగ్గరా డాక్టరు ప్రాక్టీసు చేస్తున్నాడు గనక అవన్నీ చేయగలుగుతున్నాడు. ఆస్పత్రిలో ధర్మంగా యిచ్చే మందుల్ని అంగట్లో ధర కమ్ముకుంటున్నాడు గనక చేయగలుగుతున్నాడు. అవునా! మరి అతడికాళ్లకి ఏ రూల్సూ అడ్డుపడటం లేదేమిటండీ??'

సుబ్బారావు కొత్తగా కోర్టుకెళ్లిన పిల్ల ప్లీడర్లా కళ్లు తేలేసేడు!

సుభద్ర తను చెప్పదలచుకుంది అయిపోయినట్లు బయటకి వెళ్లింది—అంతలోనే లోపలికొచ్చింది. తను చెప్పవలసిందింకా వున్నట్లు—

'ఇంతా విన్నాక 'ఆం. అవినీతికి పాల్పడే వెధవలెత్తు మనకి పోలికేంవిటీ! అయినా యింతమంది అవినీతిపరులమధ్య వున్నదాంట్లో నీతిగా బ్రతుకుతూ, దగ్గరవాళ్లను ఆదుకుంటున్న నేనే గొప్ప!' అన్న తృప్తి మీకు కలుగుతున్నట్టుంది. కాని అల్లాటి తృప్తేదీ అందుకుంటున్న వాళ్లల్లో కన్పించటం లేదు. మద్రాస్‌లో చదువుతున్న సుందరం నూట యాభై అందుకుంటూనే మీ అమ్మకి, 'ఏవిటమ్మా అన్నయ్య మరీను. నూటయాభైలో హాస్టలుబిల్లుతో సహా అన్నిఖర్చులూ అందులోనే యిముడ్చుకోవాలంటాడూ' అంటూ అసంతృప్తితో వుత్తరాలు రాయటం నే నెరుగుదును. మీ నాన్నగారు మీకు

జీత మందుకూనే పంపుతున్నదానో తృప్తిపడుతు వచ్చేతే మధ్యమధ్య ఆ బెల్లిగాంలు యివ్వరు. ఇహ సుజాత కారుకోరికలు మీకు తెలీనివికావు. ఎందుకొచ్చిన బాధ చెప్పండి. 'అంత అన్నమూ ఇంత పచ్చడీపడేయ్ తల్లీ ఆకలిగావుందీ' అంటూ వాకిటి దగ్గరకొచ్చిన బిచ్చగాణ్ణి 'ఏంలేదు ఫో'మ్మన్నా తిట్టుకుంటాడు వుత్త అన్నంపెట్టి పచ్చడి వేయ లేకపోయినా గొణుక్కుంటాడు. మీ వాళ్ళూ అంతే! ఎది గొచ్చినవారు మీరు. అయిన వాళ్ళకెల్లాగూ మొండి చెయ్యి చూపలేరు గనుక అదేదో ఎముక లేని చెయ్యే చూపండి. అలా చూపేందుకు కావలసిన ధైర్యాన్ని కూడగట్టుకుని నాలుగురాళ్ళు కూడ బెట్టండి! ఏమంటారు?'

సుబ్బారావు మొదటికేసు ఓడిపోయిన కొత్త ప్లీడర్లా తలదించేసుకున్నాడు.

సుభద్ర మౌనంగా మూల్నున్న చాప, మంచం మీది దిండు తీసుకుని పోబోయింది.

'ఎక్కడికి?'

'నా కిక్కడ గాలి రావటం లేదు!'

సుభద్ర బయటకు వెళ్ళిపోయింది. సుబ్బారావు ఆమె వెళ్ళిన వేపే చూస్తూ నడుం వాల్చేడు. వాలుస్తూ, అన్ని అర్హతలుండే ఉద్యోగం సంపాయించ లేక కుమిలిపోతున్నవాళ్ళా నలిగిపోతూ 'అయితే పై సంపాదన గురించి పట్టించుకోక బుర్రబద్దలు కొట్టుకుని అలవికాని రోగాల్ని సైతం ఓ కొలిక్కి తెచ్చి 'ధర్మప్రభు'వన్న పేరు సంపాదించుకున్నానే అదెందుకూ కొరగాదా' అని దిగులుగా ప్రశ్నించు కున్నాడు.

'కొరగాదు! ఎర్రని ఏగానికి కొరగాదు!'— పదివేల సుభద్రలూ, సుజాతలూ, సుందరంలూ, ముసలి, అమ్మ నాన్నలూ అందరూ ఒక్కపెట్టున, పెద్దపెట్టున అరిచేరు.

సుబ్బారావు ఖిన్నుడయిపోయేడు.

అదే అదనమనుకుని అన్నివేల కంఠాలు ఖంగు ఖంగున మ్రోగినై.

'మంచి పేరనే దాంట్లో కుంచం బియ్యం వైనా సంపాయించలేని అసమర్థత పేరుకు పోయింది పెద్దబ్బాయ్! నీకు తెలీదనికాదుగాని బళ్ళో పేగులు తెగేలా పాఠాల్చెప్పి, యింటి కొచ్చిన వాళ్ళని కాదన కుండా కానీ ఆశించకుండా విద్యాభిక్ష పెడుతున్న ఆ పరంధామయ్య మేష్టరెలా వున్నాడు? కడుపు నిండా తిండీ, కంటినిండా కునుకూలేక గాలిలో దీపంలా మినుకు మినుకు మంటున్నాడు. తనని కన్న వాళ్ళని, తను కన్నవాళ్ళనీ చూపి నేరం చేసిన వాళ్ళా తలదిందుకుంటున్నాడు. కాని బళ్ళో జీతా లీస్తునుకునీ పాఠాల్చెప్పక, యింటి దగ్గర డబ్బు పుచ్చుకుని ప్రైవేట్లు చెపుతూ, పరీక్ష పేపరు పరీక్షకుముందే చెప్తే యింత, పాస్ చేయిస్తే కొంత, క్లాస్ తెప్పిస్తే మరికొంత అంటూ డబ్బు గుంజు తూన్న పరాంకుశం మేష్టరెలా వున్నాడు! పేరుకు బడి పంతులైనా గుడికంటె పదిలమైన యిల్లు కట్టుకుని పవసపందులా వున్నాడు! యీ యిద్దరి 'మేష్టర్లలో ప్రయోజకుడెవరూ?' అనడిగితే 'పరాం కుశమే'నని కళ్ళులేనివాడుకూడా యిట్టే చెప్పే స్తాడు. కళ్ళున్నవాడూ గుడ్డిగా నమ్మేస్తాడు! బ్రతకలేక బడిపంతులైనవాడే ప్రయోజకుడని పించుకుంటుంటే బంగారంలాంటి డాక్టరువి నువ్వనిపించుకోటానికేమి? నువ్ మాట్లాడితే మంచి, నీతి అంటూ నీతికథలు చెపుతుంటావ్. కడివెడుపాలని చిటికెడు విషం విరిచిపారేసినట్టు సుఖ పడేందుకున్న లక్షమార్గాల్ని నిరాక్షిణ్యంగా మూసి పారేస్తున్న నువ్వాశ్రయించిన మంచి, నీతినిజాయితీలు. అటువంటివాటి నీడనుండే నువ్వు నీవాళ్ళనేం సుఖపెట్ట గలవ్? నీవాళ్ళను సుఖపెట్టలేని నువ్వుమాత్రం ఏం సుఖపడగలవ్? చెట్టు పచ్చగావున్నప్పుడే పదిమందికి నీడ నివ్వగలుగుతుంది. నువ్ హాయిగా వున్నప్పుడే పది మంది రోగులకు సేవ చేయగలుగుతావ్— నీ ఆశయం నెరవేర్చుకో గలుగుతావ్. కాబట్టి ముందు నీ సుఖం,

సీవాళ్లసుఖం చూసుకో. అయినా మాకు తెలీకడుగుతున్నాం - లంచం తీసుకుంటూ మంచివాడి వనిపించుకోవట మన్నది అంత అసాధ్యమైన పనా ఏమిటీ?'

సుబ్బారావ్ ఆలోచించేడు. 'లంచం తీసుకుంటూ గూడా మంచివాణ్ణని ఎలా అనిపించుకోగలవూ' అని ఆలోచించేడు. అతడిలా ఆలోచిస్తూండగా అర్ధరాత్రి అవూరు ఎలా వుంటుందో చూదామని వచ్చిన చంద్రుడు ఏ రావిచెట్టు తాలూకు నీడను తీసుకొచ్చి సుబ్బారావ్ పెంకుటింటిమీద వేసేడోగాని అతడికి జ్ఞానోదయమైంది. దాంతో 'ఏముంది. యిప్పుడెల్లాగూ అందరూ రోగుల్ని కన్నబిడ్డల్లా చూసుకుంటున్నా మనుకుంటున్నారు. యికనుండి వాళ్లదగ్గర కొద్దోగొప్పో వసూలుచేస్తూ వాళ్లపట్ల మరింత ఆదరణ, సంపాయించి పెట్టే కొడుక్కి తల్లిదండ్రులదగ్గిర లభించే ఆదరణలాటి ఆదరణ కనపరిస్తే సరి! 'డబ్బు తీసుకుంటేమాత్రంవేరా రోగుల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడు! అసలో కేసు తీసుకున్నాడంటే ఆ జబ్బు నయమయేదాకా నిద్రపోడుకదా మానవుడు! డబ్బుతిన్నా ఆమాత్రం సేవచేసే డాక్టరు ఇంకెక్కడా దొరక డబ్బా!!' అన్న మంచిపేరు అంచెలంచెలుగా వస్తుందని అర్థమైంది. అంచేత అతడికి వెంటనే నిద్రొచ్చేసింది—మంచంలోని నల్లుల్లూ, గదిలోని దోమలూ చెరపలేనంత నిద్రొచ్చేసింది.

తెల్లవారేసరికి సుబ్బారావ్ పద్మవ్యూహం కథవిని సుభద్ర కడుపులోంచి బయటపడ్డ అభిమన్యుడిలా లేచేడు. అరగంటలో అన్నిపన్లు ముగించుకుని శ్రీ కృష్ణుడి గీతోపదేశం విని కర్తవ్యం జ్ఞప్తికి తెచ్చుకున్న అర్జునుడిలా ఆస్పత్రికి పరుగెత్తేడు.

అప్పటికే రోగులు ఆస్పత్రిదగ్గర శనివారం వాడు సేత్ కొట్టుముందు గుమిగూడే బిచ్చగాళ్లలా వున్నారు. సుబ్బారావుని చూడగనే దణ్ణాలుపెట్టేరు. సుబ్బారావు ప్రతినమస్కారాలుచేస్తూ ఏపుగా పెరిగిన పైరునిచూసి ఆనందపడిపోయే రైతులా. ఎక్కువగా వున్న రోగుల్నిచూసి తృప్తిగా 'ఫరవాలేదు. మనిషికి రూపాయి వసూలుచేసినా పాతిక ముప్పైగిట్టొచ్చు' అనుకుంటూ హాస్పిటల్ గడప దాటబోయేడు. దాటబోతూ ఎందుకో 'గిల్టీగా', దేవుడి నగలు కాజేసి అమ్ముకు తిందామన్న దురుద్దేశ్యంతో గుళ్లో కడుగు పెట్టే పూజారిలా గిల్టీగా ఫీలయ్యేడు—కాని వెనకడుగు మాత్రం వేయలేదు. హత్యచేసేందుకై నిశ్చయించుకున్న తెంపరిలా ముందడుగువేసివెళ్లి తన సీట్లో కూచున్నాడు. ఎదురుగావున్న దేవుడి బొమ్మను చూసి మామూలుగా కళ్లు మూసుకున్నా- అలా మూసుకుని మామూలుకంటే ఎక్కువసేపున్నాడు. తర్వాత కళ్లు తెరిచి బయటకు తొంగిచూసేడు.

బయట రోగిష్టిక్యూ రోగబలంతో మరింత బలిసిపోయింది. ఆ క్యూలో కొందర్ని చూస్తుంటే 'ధర్మాసుపత్రికి మందుకోసం వచ్చిన యీ పేద ముండాకొడుకుల్దగ్గర డబ్బుచ్చుకోవటం ధర్మమా?' అన్నప్రశ్న పుట్టుకొచ్చింది. కాని గడచిన రాత్రి విడచిన ప్రశ్నలన్నీ కలిసి ఆ ప్రశ్నని తన్నుకుపోయినై. దాంతో సుబ్బారావు ఓ నిర్ణయానికి—ఫైనల్‌గా ఓ నిర్ణయానికొచ్చిన వాడిలా తేలిగ్గా గాలివదులుస్తూ తోటీని పిలిచి 'ఒక్కొక్కళ్లనే పంపు' అన్నాడు

తోటీ వెళ్లేడు.

ఒకడు కణతలు నొక్కుకుంటూ, గుండె రుద్దుకుంటూ, మూలుక్కుంటూ లోపలికొచ్చేడు.

సుబ్బారావతణ్ణి బోణీ కొట్టేందుకొచ్చిన కస్టమర్ని షాపువాడు చూసినట్టు అభిమానంగా చూస్తూ 'ఏం బాబూ ఏమిటి కంప్లెయింట'ని అడిగేడు. అడుగుతూ నాడి చూసేడు. నుదుటిమీద చేయివేసేడు. పొట్ట నొక్కేడు స్టెతస్కోపు గుండెలమీదపెట్టి 'ఒక్రూపీ యివ్వు మంచి మందిస్తా' అని కుండబద్దలు కొట్టినట్టు అడుగుదామనుకున్నాడు— కాని తన గుండెలవేగం విపరీతంగా పెరగటంతో అడగలేక ఆ రోగికో చీటీ రాసిచ్చి పంపి 'నెక్స్ట్' అన్నాడు.

ఓ పండుటాకు ఎగిరొచ్చిపడింది. దాని వెనకే

ఓ ముసలాడొచ్చేడు. అతడి కళ్లల్లో కాంతిలేదు. కడుపులో శాంతిలేదు. కాళ్లల్లో శక్తిలేదని వాటి వణుకు చూస్తేనే తెలుస్తూంది. అతడి కడుపుకూ, వీపుకూ లంకుకీ బొంకుకీ వున్నంతదూరం వుంది. అతని చేతులకి ఎండిపోయిన బీరతీగెలకీ పోలికవుంది. మనిషి మొత్తంగాచూస్తే చిన్నపిల్లలు గీసిన ఒంటిగీత బొమ్మలా వున్నాడు. అతడు వున్నపళంగా బలిచక్రవర్తైపోతే వామనమూర్తి అతగాణ్ణి పాతాళానికి పాదంతో తొక్కడు—తన గొడుగులోంచి ఓ తాటాకులాగి దాంతో అణచేస్తాడు. అతడే గనక వున్నపళంగా శిబిచక్రవర్తిగా మారిపోతే పావురం బరువు తూగే తొడమాంసం యివ్వకోలేక తొడ ఎముకని మాత్రంతీసి త్రాసులో వేస్తాడు. కాని అతడు అటు బలిచక్రవర్తీ కాదు, ఇటు శిబిచక్రవర్తీ కాదు. కేవలం ఎండి ఈనెలు బయటపడిన రావి ఆకులానో, కాళ్ల కింద నలిగిపోయిన ఖాళీ సిగరెట్టు పెట్టెలానో వున్న రోగి—డబ్బువుంటే ఆస్తితికి ఛస్తేరానిమనిషి! అతణ్ణి చూసిన సుబ్బారావు కరిగి—అతని పుండ్లని కడిగించి – పదేపదే ఆలోచించి తను ఎంతో మంచి దనుకులటున్న మందురాయించి పంపేడు (ముసలాడు అడగలేదుగాని ఆడిగితే పావలో అర్ధో సర్దివుణ్ణు!) కాని డబ్బడగలేదు. 'తర్వాత' అన్నాడు చనిపోయిన తండ్రికి దహన సంస్కారాలెలా చేయాలో తెలీని వాడిలా!

తర్వాత—వాతలు పెట్టుకున్న నక్కలా, పులివేషంవేసిన మనిషిలా భారీ డిజైన్లు, గాడీ రంగులూవున్న బట్టలు వేసుకున్నవాడు, విద్యార్థో ఉద్యోగో అర్థంకాకుండా వున్నవాడు వచ్చేడు. రోడ్డంట వెళ్తుంటే కుక్క వెంటబడి మరీ కరిచిందని గగ్గోలు పెట్టసాగేడు. సుబ్బారావతడికివ్వవలసిన పథ్యాలుగు ఇంజక్షన్లలో ఒకటిచ్చి డబ్బడగబోయేడు. అడగబోతూ పేషంటు ముఖంచూసేడు. గోడనున్న దాలుకి బిగించిన కత్తుల్లా పేషంటు ముదురు మూతిమీది మీసాలు, తలుచుకుంటే అంతు చూడగలను అన్నట్టున్న ఎర్రజీరల కళ్లూ కన్పించేయి. డబ్బడిగితే ఈ వెధవ రిపోర్టిచ్చినా యివ్వగలడని భయపడిపోయిన సుబ్బారావు ఆ పేషంటుని వదిలేసేడు.

ఆ తర్వాత మరోఅడాచ్చేడు—అతడు వెళ్లిపోయేడు. ఆతర్వాత మరో పేషంటు ఆడపేషంటు... మగపేషంటు... ముసలి.. వయసు... బాల .. జేల... ఎందరో రోగులొచ్చి రాగాలేసి వెళ్లిపోయేరు. సుబ్బారావు మాత్రం ఏదోకారణంగా ఎవర్నీ డబ్బడగలేకపోయేడు. చివరికి ఏదయితే అదవుతుందని యీసారొచ్చేవాడ్ని తప్పక అడిగేయాలని 'నెక్స్ట్' అన్నాడు దృఢంగా.

తోటీ వచ్చేడు—'అంతా అయిపోయేరు సార్' అంటూ!

అందరూ అయిపోయేరా! సుబ్బారావు వుస్సురన్నాడు. నీటికోసం ఏటికివెళ్లి, ఏటినిచూసి భయపడి వుత్తబిందెతో తిరిగొచ్చిన కొత్త కోడల్లావుంది మన పరిస్థితి అనుకున్నాడు. అనుకుని నవ్వుకున్నాడు. నవ్వుకుంటూ 'నవ్వకూడా వెధవ మొహానికి' అని తనను తనే తిట్టుకుంటూ విసురుగావెళ్లి నర్సుతో కబుర్లుచెప్తున్న కంపౌండర్ని తిట్టి ఏంవేం మందులు కలపాలో చెప్పి, కంపౌండరుతో అంతవరకూ కబుర్లు చెప్తూ కూచున్న నర్సును మందలించి వెంటబెట్టుకుని ఆ ఆస్పత్రిలో వుంటున్న పదిమంది మంచం పేషంట్లనీ, నలుగురు నేలపేషంట్లనీ చూసేందుకు వెళ్లేడు. చూసేడు—వచ్చేడు—వచ్చి పేపరు చదివేడు. చదివి టైము చూసుకుని, ఒంటిగంటవరకు కారియర్‌కోసం 'వెయిట్' చేసి, ఒకటిన్నరకు భోజనం ముగించి 'రోగుల్దగ్గర డబ్బు గుంజాటెలా?' అన్న విషయమై పదేపదే ఆలోచించసాగేడు. మధ్య మధ్య 'పోనీ కంపౌండర్‌గాడ్ని అడుగుదామా' అనుకున్నాడుగాని ఇప్పటివరకు తనంటె భయపడిఛస్తున్న వెధవ ఈవిషయం అడిగిందగ్గర్నుంచీ తనని భయపెట్టి చంపుతాడేమోనని భయపడి అలా అనుకోవటం మానేశాడు—ఆలోచించటం మాత్రం మాన్లేదు.

మొత్తానికి సుబ్బారావు ఆలోచనలు వాటంతటవి తెగలేదు—గడియారం తెంపింది మూడు గంటలుకొట్టి! సుబ్బారావు సర్దుకు కూచున్నాడు. మెల్లమెల్లగా పాతరోగులు పాతచీటీల్తో పాత ఖైదీల్లా రాసాగేరు. వాళ్లలో తాతలాటి వాళ్లెవరైనా కానుకల్లాటి వేమైనా తెస్తారేమోనని చూసేడు, సుబ్బారావు. కాని వాళ్లు రోగలక్షణాలు, పొగడ్తలఅక్షరాలూతప్ప మరేం మోసుకురాలేదు.

సుబ్బారావు నిర్లిప్తంగా నాలుగున్నర వరకూ వాళ్లతోనూ, అయిదున్నరవరకూ ఏకాంతంగానూ గడిపి 'ఇక ఇంటికైనా వెళ్దాం' అనుకుంటూ లేచాడు.

అప్పుడే హాస్పిటల్ ముందుకో కారొచ్చి ఆగింది. అందులోంచి మహారాజులాంటి పెద్దమనిషి, అతన్తోపాటు కాబోయే మహారాజులాటి వో చిన్న మనిషి దిగేరు.

సుబ్బారావుకు ముందుదిగిన పెద్దమనిషి పేరు తెలుసు—హరిశ్చంద్రరావని. అతనిపదవి తెలుసు—పలుకుబడి తెలుసు! అయితే అతడెందుకొచ్చేడో తెలీదు! అందుకే లేచి ఎదురువెళ్తున్నట్టు రెండడుగులువేసి 'రండి రండి ఏదో పనిమీద వచ్చినట్టున్నారు' అన్నాడు.

'పుట్టిన ప్రతివాడికి మావంటివాళ్లతో పనుండక పోవచ్చుగాని డాక్టర్లతో పనిపడక పోతుందా సుబ్బారావుగారూ!' మీతో పనుండే వచ్చేను...మీకు...'

'పనేంలేదు కూచోండి ... వూ ... ఇప్పుడు చెప్పండి.'

'ఏం లేదండీ! వీడు నా బావమరిది. కాలేజీకి పోరా అంటే కాబేజీ పువ్వులా తయారై మేతకు బయల్దేరిన గువ్వపిట్టలా వూరంతా బలాదూరు తిరిగొస్తాడేగాని కాలేజీకివెళ్లిన పాపానపోడు. అయితే వీళ్లో ఓ సుగుణం వుంది. సంవత్సరమంతా అల్లా తిరిగినా చివర్లో కష్టపడి చదువుతాడు—అన్ని పరీక్షలు రాసాడు. ఫస్టున కాకపోయినా పాసవుతాడు!!'

'మంచిదే!'

'కాని యిప్పుడా మంచికాస్తా జరక్కుండా పోయేట్టుంది సుబ్బారావుగారూ! వీళ్ల కాలేజీలో నిన్నా యివాళా యేవో పరీక్షలు పెట్టేరుట. వాటికంటే ముందూ, వాటికి హాజరుకాని వారిని పెద్ద పరీక్షలకి పంపేది లేదని నోటీసు పెట్టేరుట. ఆ నోటీసు యీ వెధవాయి నోటీసుకు రాలేదు. అంచేత కాలేజీ పరీక్షలేగదా అని ఎగ్గొట్టేసేడు. ఓ గంట క్రితం ఆ నోటీసు సంగతి తెలుసుకుని ఒకటే ఏడుపూ! అక్కడికీ నేను వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాటాడేను. ఆయన 'ససేమిరా వీల్లేద'న్నాడు. 'ఇప్పుడు వీణ్ణి వదిలేస్తే వీడితోపాటు పరీక్షలెగ్గొట్టిన వాళ్లంతా ఎగబడతారు. కాబట్టి యీ విషయంలో నేనేం చేయలేనూ. చేయగలిగింది ఒక్క గవర్నమెంటు డాక్టరే' అనికూడా అన్నాడు!'

'నేనా...నేనేం చేయగలను సార్!'—తన శక్తి తనకు తెలీని ఆంజనేయుళ్లా బిడియపడి పోయేడు సుబ్బారావు.

'మీరా...మీరు మా వెధవకి పరీక్ష భిక్ష పెట్టగలరు సార్! మీరు 'ఎలా' అని అడక్కుండా ఎలాగో నేనే చెప్తున్నా వినండి. ఏంలేదూ...మా వాడికి యేదో జబ్బు పట్టుకుందని నిన్నా యివాళ యీ హాస్పిటల్లోనే వున్నాడని చిన్న సర్టిఫికెటు ముక్క పారెయ్యండి. తర్వాతదంతా నేను చూసుకుంటాను!'

సుబ్బారావ్ అయ్య బాబోయ్ అన్నట్టు కొయ్యబారి పోయేడు. ఆ తర్వాత కాస్సేపటికి మెత్తబడి 'తత్తత్తప్పండీ' అన్నాడు.

'ఇందులో తప్పేముందయ్యా పిచ్చిబ్రాహ్మడా! నువ్వేవన్నా తాగినోణ్ణి పట్టుకుని తాగలేదన్నట్టు సర్టిఫికేటిస్తున్నావా? లేకపోతే (డబ్బుతిని) కత్తిపోటుకు చచ్చినవాణ్ణి పరీక్షచేసి గుండెపోటుకు చచ్చేడని తప్పుడు సాక్ష్యం చెప్తున్నావా? కేవలం ఓ బీదముండాకొడుక్కి సాయం చేస్తున్నా వంతే!!'

[ఎందుకురా హరిశ్చంద్రుడూ వూ్వరికే అబద్ధాలాడతావ్! అంతలేసి ఖరీదైన బట్టలూ, మెళ్లో బంగారపుగొలుసు చేతికి బంగారంలాంటి వాచీ, అయిదింట్లో నాలుగువేళ్లకి ముద్దొచ్చే వుంగరాలూ—వీటితో కొత్తమందుల కంపెనీవారి శాంపిల్ సీసాలా వెలిగిపోతున్నవాణ్ణి పట్టుకుని బీద ముండాకొడుకని చెప్తావ్. అంత పచ్చిఅబద్ధం పనికి రాదు రోరేయ్!]

సుబ్బారావు అన్యాయాన్ని సహించవలసి వచ్చినవాళ్లా వో వెర్రినవ్వు నవ్వేడు.

'ఏమిటి డాక్టరుగారూ నవ్వుతున్నారు? సూటూబూటూ వేసుకున్న వాణ్ణి పట్టుకుని బీదవాడంటున్నాననా? మీకు తెలీం దేముంది... యివన్నీ షోకింగ్ డాబుసర్లే! నిజానికి ఈవెధవ వెనక వీడెప్పుడు సంపాయిస్తాడా, కష్టాలెప్పుడు గట్టెక్కుతాయా అని ఎదురుచూచే తల్లీ, వీడెప్పుడు సంపాయిస్తాడో నన్నొకయ్యచేతిలో ఎప్పుడు పెడ్తాడో అని చింతపడే చెల్లెతప్ప చిల్లికానీకూడా లేదు! యిహ నేనున్నానంటే దేశంమనిషిని. మీకెంతవరకు వుపయోగపడగలనో వీడికీ అంతే వుపయోగపడగలను గాని అంతకుమించి వీసమెత్తు సాయంకూడా చేయ లేను. ఈ పరిస్థితుల్లో వీడు పరీక్షలకు పోకపోతే ఒకఏడు నష్టమవుతుంది. ఒకఏడు నష్టమైతే—చదువూ, చదువుకి పెట్టినడబ్బు, డబ్బుతో పన్లేని వయసూ, వయసుతో పనివున్న వుద్యోగం, చెల్లి పెళ్లి, అమ్మఆశ—అన్నీ నష్టమవుతాయి డాక్టరూ... కనికరించు...వీడి కీ సాయం చేయి!'

సుబ్బారావు యిరుకునపడ్డాడు. వీళ్ల కన్నీళ్లు తుడవటానికి సర్టిఫికెటిస్తే ఆ దొంగ సర్టిఫికెటిచ్చిన నేరానికి తనూ తనవాళ్లూ కళ్లనీళ్లు నింపుకోవాల్సొస్తుందేమోనన్న భయంలో పడ్డాడు.

సంశయిస్తున్న సుబ్బారావుకేసి హరిశ్చంద్రరావు విశ్వామిత్రుడి చూపొకటి చూసేడు. అంతలోనే వశిష్ఠుడిలా చల్లగా చూసేడు. మరు నిముషంలో క్లయిమాక్స్‌లో తనతప్పులు తెలుసుకున్న ఇంద్రుడిలా తనని తనే తిట్టుకుంటున్నట్టుగా అన్నాడు—

'అయ్యయ్యో నాతెలివి మండిపోనూ! యింత పెద్దపని మీ నెత్తినబెట్టి మీకేమాత్రంవూ సాయం చేయకుండా యిలా కూచుండి పోయానేమిటీ బదుద్దాయిని!' అంటూ జేబులోంచి పది కొత్త పదిరూపాయల నోట్లను తీసి బల్లమీద పెట్టేడు హరిశ్చంద్రరావు.

సుబ్బారావు తలెత్తి చూసేడు ఎదురుగా నోట్లు! నోట్లమీంచి 'పిల్లనచ్చిందా' అన్నట్టు చూస్తున్న హరిశ్చంద్రుడు'!

[మహానటుడు దేవదంటే మొట్టమొదట నీపేరు చెప్పుకోవాల్రా హరిశ్చంద్రుడూ! ఇచ్చేదంవాలన్నీ. పుచ్చుకునే దొంగ సర్టిఫికెట్టునూ మానవత్వం, సహాయాల ముసుగులో పడేసి గారడి చేస్తున్నావ్. ఆ వచ్చేదేదో నిన్నవచ్చి, యీ యిచ్చేదేదో నిన్న యిచ్చి యిప్పుడు వాగుతుండేదో నిన్న వాగుంటే నీపని పట్టుండే వాణ్ణి! నీ నాలుక పీకి చేతికిచ్చి నిన్ను యింటికి పంపుండేవాణ్ణి. నీ అదృష్టం బాగుండి యివాళొచ్చేవ్! యివాళ...యివాళ...]

సుబ్బారావ్ 'యమస్ట్రిక్ట్' అన్నవిషయం హరిశంద్రరావుకి తెలిశాకనే అందరికీ తెలిసింది. అయినా అతడు అదేవీ తెలీనివాళ్లా యేమాత్రం తొణక్కుండా మానవప్రయత్నంగా, బజార్లో అయిదు రూపాయిలకు దొరికే సర్టిఫికెట్టుకు వందరూపాయిలి పెట్టుబడి పెట్టేడు. సుబ్బారావు ఆ వందకేసి వోపక్క అసహ్యంగానూ, మరోపక్క ఇంటికొచ్చి వెళ్లేచుట్టం ముచ్చటపడి యిచ్చేరూపాయని 'తీసుకోనా వద్దా' అన్నట్టు తల్లికేసిచూసే చిన్నారిలాగూ చూట్టం కనిపెట్టేడు. అంచేత యింకొంచెం కష్టపడితే సుబ్బారావు మెత్తబడటం ఖాయం అని తియ్యగా, పుట్టలోని పాముని బుట్టలోకి తెచ్చేందుకు పాములవాడు వూదే నాగస్వరంలా అతితియ్యగా, అంతే వినయంగా అన్నాడు—

'మీరుచేసే సాయానికి యీ చిన్నమొత్తం ఎంతమాత్రం సరితూగేది కాదు. అయినా తమరు అనుగ్రహించక తప్పదు!'

సుబ్బారావు తటపటాయించేడు.

'మీరేం భయపడకండి సుబ్బారావుగారూ! యీ కానుక స్వీకరించండి. యిందులో తప్పేంలేదు! ఓ వేళ ఏ గాడిదన్నావచ్చి 'యిందులో తప్పుందీ నిన్ను జైల్లో వేయిస్తానూ' అంటే మీరు ఆ గాడిద కాళ్లు పట్టుకోక వెంటనేవచ్చి నా కళ్లపడండి నేను ఆ గాడిద కలలో కన్పించి మిమ్మల్నాదుకుంటాను.'

సుబ్బారావు డబ్బు ముట్టుకోలేదు—డ్రాయరు సొరుగు లాగేడు. అందులోంచి లెటర్‌పేడ్‌తీసి హరిశ్చంద్రుడి బావమరిదిని పూర్తి పేరడిగేడు.

బావమరిది 'ఎ. నరోత్తమరావని' చెప్పేడు.

సుబ్బారావు బుర్రగోంకుకుని 'ఎ. నరోత్తమరావు మొన్న అనగా ఫలానా తేదీ సాయంత్రం ఫలానా జబ్బుతో హాస్పిటల్లో చేరేడు. యివాళ అంటే ఫలానా తేదీ రాత్రికి బాధావిముక్తుడై హాస్పిటల్ వదిలేడు' అని రాసి, ఒకసారి చదువుకుని కింద సంతకంచేసి సర్టిఫికెట్టును హరిశ్చంద్రరావు కందించేడు.

హరిశ్చంద్రరావు కాగితాన్ని కిందనుండి... కాదు...పైనుండి కిందకోసారిచూసి బావమరిదికిచ్చేడు. బావమరిది ఆ కాగితాన్ని జేబులో భద్రం చేసి లేస్తూ 'మీ మేలు జన్మలో మరిచిపోలేను డాక్టర్! మరి పోదామా బావగారూ ఆలస్యమౌతోంది' అన్నాడు.

హరిశ్చంద్రరావుకూడా లేస్తూ 'యీ జన్మలోనే కాదురా వెధవా వచ్చే జన్మలోకూడా మరచిపోలేవ్' అన్నాడు, సుబ్బారావ్‌కేసి చూస్తూ.

సుబ్బారావు సిగ్గుపడిపోయేడు. అతడందులోంచి తేరుకునే లోపలే హరిశ్చంద్రరావు 'వస్తామండి. అప్పుడప్పుడూ కన్పిస్తూండండి' అన్చెప్పి బావమరిదిని తీసుకువెళ్లిపోయేడు.

పెద్దవాడి చావుతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సంపాయించుకున్న చిన్నవాడిలా సుబ్బారావు హరిశ్చంద్రరావు వాళ్లటు వెళ్లగనే యిందాకట్నుండి గుండెలో పేరుకుంటున్న సంతోషాన్ని నిశ్శబ్దంలేని నవ్వులో కక్కేశాడు. ఎదురుగా టేబుల్‌మీదున్న పది పదిరూపాయల నోట్లను దోసిట్లోకి తీసుకు పదే పదే చూసుకున్నాడు. అలా చూసుకుంటుంటే ఎక్కడ్నుండో, ఎవరో ఎందరో కోర్టుని నమ్మించలేని వచ్చినిజంలా, కసిగా, అసహాయంగా, రుద్ధకంఠంతో 'నీ చేతిలో వున్నది పాపం. నీ నవ్వులో వున్నది మలినం! నువ్ నిలువునా పాతిపెడుతున్నది నీలోని ధర్మప్రభువుని! నీ ఆత్మని!! నీ అభిమానాన్ని!!!' అనంటున్నట్లనిపించింది.

సుబ్బారావు గాభరాగా నోట్లను జేబులో కుక్కుకున్నాడు. ఆస్తికోసం నిలువెత్తు మనిషిలో తళతళలాడే కత్తిని దించి ఉవ్వెత్తునలేచే రక్తంలో అతన్ని పొర్లించి, ఆ రక్తంతోనే తన చేతులు కడుక్కుని...చివరికి ఆ హృదయ విదారక దృశ్యాన్ని గుర్తుంచుకొని నిశ్చింతగా బ్రతకటం దుర్భరమని గ్రహించి దాన్ని మరిచిపోయేందుకు ఆ చచ్చినవాడి ఆస్తితెచ్చే సౌఖ్యాలను ఊహల్లో అనుభవించే హంతకుడిలా సుబ్బారావుకూడా నీతినిజాయితీలాటి వాటిని మరచిపోయేందుకు ప్రయత్నిస్తూ, తనీస్తున్నకెళ్తున్న వందరూపాయల్నిచూసి సుభద్ర ఎంతగా ఆనందిస్తుందో తలచుకుంటూ 'యిక వెళ్దాం' అనుకుంటూ లేచేడు.

కాని సుబ్బారావు వెళ్ళేందుకు వీల్లేకుండా నర్సు పరుగెట్టుకొచ్చింది — 'డాక్టర్ డాక్టర్' అంటూ.

'ఏమిటి ?'

'మూడోనంబరు పేషంటూ...'

'ఏం పోయేడా ?'

నర్సు పరుపోయిందని తెల్సుకున్నదాన్లా నోరు తెరిచింది. అందులోంచి 'ఎప్పుడూ పేషంటును

ప్రేమించుమన్నా అంటుండే డాక్టరు యిప్పుడిలా అనేశాడేవిటా !?' అన్న ఆశ్చర్యం బయటపడింది.

'ఏవిటీ అసలుసంగతి చెప్పకుండా అలా నోరు తెరిచేవ్ ?'

'ఆఁ... ఆ మూడోనంబరు పేషంటుకు యింజక్షనిస్తే రియాక్షన్ వచ్చింది.'

'అల్లాగా...పదపద !'

సుబ్బారావు హడావిడిగా వార్డుకు వెళ్లి మూడోనెంబరు పేషంటుకో యింజక్షన్ పొడిచి, పన్లోపనని పక్కపేషంట్లను కూడా పలకరించి, మళ్లీ మూడోనంబరు పేషంటు దగ్గరకొచ్చి ఓ అరగంట కూచుని 'యిహపర్లేదు...' అను కుంటూ లేచేడు.

కాని మళ్లీ నర్సు అడ్డొచ్చింది— 'డాక్టర్ ఏదో కాజువాలిటీ...'

సుబ్బారావు కోపం వచ్చింది. చేస్తూ చేస్తూన్న మంత్రిపదవిని చూస్తూ చూస్తూ వదులుకోవాల్సొచ్చిన పెద్దమనిషి కొచ్చేకోపం వచ్చింది. కాని తమాయించుకుని నర్సుకేసి తిరిగి 'కాజువాలిటీ అని అలా నిలబడిపోతావేం... నడూ' అని కసిరేడు.

నర్సు కమ్చీ దెబ్బతిన్న గుర్రంలా పరుగెత్తింది.

సుబ్బారావు బక్కచిక్కిన గుర్రం లాగుతున్న బండిలా నడుస్తూ 'కన్సల్టింగ్ రూమ్'లోకొచ్చే సరికి రోగులకోసం వేసిన బల్లమీద యిద్దరు కూచుని వున్నారు. మోకాళ్లదాకా పంచె, పైన బనీను, మాసిన తలగుడ్డ—వీటితో ప్రభుత్వం వారు ప్రచురించే 'జై జవాన్ జై కిసాన్' బొమ్మ ల్లోని కిసానుల్లా—కాపోతే కాస్త బక్కచిక్కిన కిసానుల్లా వున్నారు. డాక్టర్ని చూడగానే పోలీసును చూసిన పాతకేడీల్లా ఠక్కునలేచి వినయంగా నిలబడ్డారు.

'ఏంకావాలి మీకు?'—సుబ్బారా వడిగాడు.

'వాళ్లే ఆ కేసు తెచ్చింది !'— నర్సు చెప్పింది.

'కేసు' అనేసరికి కిసానుల్లో వణుకు ప్రారంభమైంది. అంతెత్తు మనుషులూ తలమకుంటే సుబ్బారావు జాత్తే అందుతుందిగానీ వాళ్లు అలా తలచుకోక కిందపడి డాక్టరు కాళ్లు పట్టుకున్నంత పనిచేసేరు— 'రచ్చించండి బాబూ ! మాకేటి తెల్దు మమ్మల్ని రచ్చించండి' అంటూ.

నర్సు డాక్టరు సుబ్బారావుకేసి చూసింది.

సుబ్బారావు కిసాన్లకేసే చూస్తున్నాడుగాని జాలిగా చూట్టంలేదు. వినుగ్గా చూస్తున్నాడు.

అంచేత నర్సమ్మ కిసాన్లతో 'మీకేం భయం లేదు లేవండి బాబూ ! జరిగిందేవిటో డాక్టరు గారికి నెమ్మదిగా చెప్పండి' అని అనునయంగా అన్లేదు. 'మీకు తెలిసిందేవిటో త్వరగా చెప్పి అవతలకు వెళ్లండయ్యా ! మాకింకా పన్లున్నై!' అని గదిమింది.

కిసాన్లు లేచి నిలుచున్నారు. రెండునోళ్లూ కలిపి ఒక్కనోటితో చెప్పినట్టు చేప్పేరు

'మా పొలాలకి ఎరువుతోలి మాపిటేలకి మేఁ విద్దరం యింటికి బయలెల్లావండి. నేను తొట్లో—ఆడు బండ్లో. కాదుకాదు...ఆడేతొట్లో... నేను బండ్లో కూకుని అమాటా యీమాటా మాట్టాడుకుంటు ఎడ్లని అదిలిస్తున్నామండి. యింతలో బండి మన రాజాగారి తోట్లేదూ... ఆ తోటకాడికొచ్చింది...అక్కడికొచ్చేసరికి మాకేదో మూలుగు యినిపించింది. అదేదో ఎలుగు మూలుగైతే మేం ఆసాయలకే పొయ్యేవాల్లం కాదు కాని ఆ యిని పించింది మడిసి మూలుగాయె! అందుకే మాకు కాళ్లాడక బండినాపి మెల్లగా తోటలో కెల్లినం. లోపల మర్రిచెట్టుకింద...చెట్టంతలేదుగాని వచ్చటి చెట్టులాంటి మడిసి సిందర వందరగా, బండికింద పడ్డ బంతి పువ్వులా మూలుగుతూ పడుంది. మేం యిద్దరం ఆ సుట్టుపక్కల వోరన్నా వున్నరేమో

వనీ గాలించినంగాని ఓరూ కనపడ్లే! మరి చేసేది లేక ఆ మడిసిని అట్టా ఒదిలెయ్యటానికి మన సొప్పక అట్టాగే బండిలో యేసుకుని బయలెల్లినం. పెందలాడే వూర్లో పడాలని మా ఆలోచన కాని యెంత అదలించినా, యెన్ని తగిలించినా ఎద్దునడక ఎద్దునడకేగదా! అయ్యి మా బండిని వూల్లోకి తెచ్చేసరికి దీపాలు ఎలుగుతున్నై. దగ్గరగా వున్నాడు గదా అని ఆ కోనేటి దగ్గర డాక్టరు కాడికెల్తే ఆయన సినిమాకి పోయినాడన్నారు. సరేనని సిని మాలు దగ్గరి డాక్టరు కాడికి పోయినం. ఆయన గీసి గీసి బేరమాడి పదిరూపాయల కొప్పుకొని ఆమడిసికి యిండీస నిచ్చినడు. యిండీసనిచ్చిన పావుగంటకు ఆ యమ్మ లేచింది - అంకమ్మ శివాళ్ల మొదలెట్టింది. కాసేపు ఏడిచింది—కాసేపు నవ్వింది – కాసేపు పెద్ద పెద్దగా అరిచింది. చివరికి అందుబాట్లో వున్న డాక్టరు చెయ్యి కరవబోయింది. యిహ డాక్టరు ఒహాటే బెంబేలెత్తిపోయ్యి అడ్డమొచ్చిన యిండీస వేదో అమ్మడికి పొడిచేసేడు. దాంతో అమ్మడు గమ్మున నిద్రపోయింది. అమ్మడు నిద్రపోయేక డాకటరు మాతో 'యీ అమ్మాయి నిక్కడుంచకూడదూ పెద్దాసుపత్రికి తోలుకెల్లండి' అన్నాడు. మేం తోలు కొచ్చినం. యింతే దొర! మేం వున్నేనికి పోయివం. మా కేపాపం తెల్దు... రచ్చించండి...'

సుబ్బారావు కిసాన్లు చెప్పిందంతా సావధానంగా కాకపోయినా విన్నాడు. విని,

'సర్సే! మీరు చెప్పాల్సిందేదో చెప్పారుగా. కాస్సేపలా కూచోండి మేం పేషంటుని చూసొస్తాం' అన్నాడు. అంటూ నర్సుకేసి చూసేడు 'నడు'అన్నట్టు.

నర్సు దారి తెలిసిన దొంగలా గబగబ పేషంటున్న గదిలోకి దారి తీసింది.

సుబ్బారావు నర్సును అనుసరిస్తూ గదిలోకి వెళ్ళేడు. పేషంటుకేసి రెండడుగులువేసి పేషంటు ముఖంలోకి చూసేడు—

అంతే సార్ అంతే!

అంత డాకరూ నడుంవరకూ పూడ్చిపెట్టబడిన వాడిలా, గోడక్కొట్టిన మేకులా నిలబడి పోయేడు.

పై రెప్పకి దారంవేసి యింటికప్పుకి, కింది రెప్పకు దారంవేసి కాలిబ్రేలికి కట్టినట్లు తెరిచిన కళ్ళు మూయకుండా అలాగే చూస్తుండి పోయేడు!

ఎదురుగా — గిన్నెనిండుగా వున్న వెన్నని నాలుగువేళ్లతో తోడినట్లు తెల్లగా—కాదు—పచ్చగా — బంగారు పచ్చగా వుండాల్సిన పేషంటు చెక్కిళ్ళపైన రాక్షసి గోళ్ళగుర్తుల్ని, గుర్తుల్లోని రక్తపు చారికల్ని చూస్తుండి పోయేడు!

కొత్త సబ్బుబిళ్లకు సరికొత్త కాగితపు మూతలా అమరివున్న చీరే జాకెట్టూ చిన్నపిల్లవాడు చింపిన కాగితంలా చీలికలై వుండటం గమనించేడు!!

చేతులమీద, కాళ్ళమీద, ముఖంమీదా, ముక్కు మీదా గాయాలతో కాకులు పొడిచిన సబ్బుబిళ్ళలా వున్న ఆమెని చూస్తూ...చూస్తూ...ఒక్కగావుకేక పెట్టేడు— 'బేబీ!' అని.

నర్సు జడుసుకుంది. శవం లేచి గొంతు పట్టుకున్నట్టు భయపడింది — బిత్తరబోయింది! తేరుకుని, ధైర్యంచేసి 'డాక్టర్' అంది.

సుబ్బారావప్పటికే సుజాత దగ్గర కెళ్లి పోయేడు. ఆ అమ్మాయి నంటిమీద దెబ్బల్ని నిమురుతూ, ఆ దెబ్బలన్నీ తనకే తగిలినట్లూ, ఆ గాయాలు తెగసలుపుతున్నట్లూ బాధపడుతూ కన్నీటి కథ చెప్తున్నట్టు, కరుడుగట్టిన గుండె సైతం కరిగిపోయేలా అన్నాడు—

'నా చెల్లెలు సిస్టర్! నా చెల్లెలు సుజాత!! యీ నా చిట్టితల్లిలో యెంత అందముందో అంత మంచితనముంది! యెంత తెలివుందో అంత జాలి గుండెవుంది. తెలిసి ఎవ్వరికీ, చివరికి చీమకూడా అపకారం చేయలేదు నా చెల్లెలు. ఆ అందానికి,

అంత మంచితనానికి ఎంతమంచి బహుమతి లభించిందో చూడు సిస్టర్ !'

నర్సు మాట్లాడ్లేక పోయింది.

కాని సుబ్బారావు కొట్లాటలో ఓడిపోయిన వాడు ఆవేశపడినట్లు వూగిపోతూ—

'వదిలిపెట్టను సిస్టర్ ! నా చెల్లినిలా చిత్రహింస పెట్టినవాడిని యింతకు పదింతలు బాధించి గాని వదల్ను !'

'డాక్టర్ ! ముందు...మందు !'

'అవును...ముందు నా బేబిని రక్షించుకోవాలి...రక్షించుకోవాలి...' సుబ్బారావు గబగబవెళ్లి మెడికల్‌పెట్టె గుమ్మరించి అందులోంచి రెండు సీసాలు ఏరి నర్సుకిచ్చేడు.

'ఈ ఇంజక్షనివ్వు సిస్టర్! నువ్వే యివ్వు!'

నర్సు సుజాతకి ఇంజక్షనిచ్చింది.

ఇంజక్షనిచ్చిన కొద్ది నిమిషాలకి సుజాత కదిలింది. కనురెప్పలు కదిలించింది. కళ్లుతెరచి ఎదురుగా చూసింది.

సుబ్బారావు ఆనందపడి పోయేడు. తన్లో వున్న అనురాగాన్ని, ఆప్యాయతనీ రంగరించి, ప్రేమగా సుజాత తలనిమురుతూ అడిగేడు—

'ఎలా వుందమ్మా బేబీ?'

సుజాత అన్నయ్యను గుర్తుపట్టింది. కాని తన బాధల్నే గుర్తుపట్టనట్టుంది—కిలకిలా నవ్వేసింది.

సమయంకాని సమయంలో నవ్వగూడని నవ్వు నవ్విన సుజాత న్చూస్తుంటే సుబ్బారావుకి దిగులేసింది.

'ఎందుకమ్మా బేబీ ఆ నవ్వు?'

'సుఖాన్ని కొనుక్కుందుకు మన్దగ్గర డబ్బులేదుగా అన్నయ్యా! అలా అని దానికోసం ముష్టెత్తుకోనూలేమాయె! అందుకని దాన్ని ఉచితంగా సంపాయించే నన్నయ్యా! అందుకే యీ ఆనందం!!'

'బేబీ! ఏమిటమ్మా ఆ మాటలు?'

'అవంతేగాని అన్నయ్యా యీ విషయం విన్నావా?'

'ఏమిటది?'

'వరదరాజులనీ...మా కాలేజీ కుర్రాడే! ఓరోజు నా క్లాస్‌మేట్ పార్వతి దగ్గరకెళ్లి 'మీ పుట్టిన్రోజు పండక్కి నేనూ రావొచ్చా!' అనడిగేడుట. దానికి పార్వతి 'వస్తే నైలెక్స్‌చీర కానుకగా తేవాలి' అందిట. అంతే! అతగాడు ఆ మాట పుచ్చుకుని మర్నాడు పార్వతి వాళ్లింటికెళ్లి ఖరీదైన నైలెక్స్ చీర ఒకటి పుట్టిన్రోజు బహుమతిగా యిచ్చేట్ట! యి తాచేస్తే అతడికి పార్వతికి అట్టే పరిచయం కూడా లేదుట. మా సుందరి చెప్పింది! చూశావా అన్నయ్యా మీ మగాళ్లు ఎంత వెర్రివాళ్లు!'

'ఇప్పుడవన్నీ ఎందుకు బేబీ!'

'అవును. ఇప్పుడవన్నీ ఎందుకూ......వన్నీ ఎందుకూ...'—సుజాత కళ్లు మూసుకుంది

సుబ్బారావు కంగారుగా 'బేబీ బేబీ' అంటూ సుజాతను తట్టేడు. సుజాత లేవలేదు!

'సిస్టర్ !'

నర్సు వో ఇంజక్షనిచ్చింది.

సుజాత కళ్ళు తెరిచింది.

'అసలేం జరిగింది తల్లి ! ఎందుకు.. ఎందుకు నువ్విలా అయిపోతున్నావ్?'

'జరిగేందు కేముందన్నయ్యా ! ఇవ్వాళ ఆదివారమైనా ప్రయివేటు క్లాసుంది. అందుకని ఉదయమేలేచి కాలేజీ కెళ్లేను. క్లాసయి బయట కొచ్చేసరికి సరికొత్తకారు, ఎండలో బంగారంలా ధగధగ లాడుతోంది. చిన్నపిల్లలు కార్లూ, విమానాల్తోటి ఆడుకుని తృప్తిపడతారు. పెద్దవాళ్లు వాటిలో సుఖంగా కూచోగలిగినప్పుడే తృప్తిపడతారు. మరి నేనూ పెద్దదాన్నేగా—అయినా కారెక్కే యోగ్యతలేదు గనక కొత్తకారుని చూసి ముచ్చట పడుతున్నాను. అంతలోనే మా క్లాస్‌మెటొకత

వొచ్చి కారెక్కబోతూ నన్నుచూసి 'రండి. మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను' అన్నాడు. చూశావా అన్నయ్యా. అంతడబ్బున్నవాడైనా యెంతటిదయార్ద్ర హృదయుడో! అందుకే అతడి కక్కడికక్కడే 'థాంక్స్' చెప్పి కారెక్కి కూచున్నాను. కారు బయల్దేర బోతూండగా అతడి స్నేహితులు నలుగురు కాలినడకన పోతూ కన్పించేరు. ముందే చెప్పానుగా అతడు దయార్ద్రహృదయుడని. అంచేత అతను కారాపి ఆ నలుగుర్ని ఎక్కించుకున్నాడు. కారు బయల్దేరేక అతడికో 'అయిడియా' వచ్చింది— ఆదివారమేకదా అలా తోటదాకా షికారుకెళ్లొస్తే ఎలా వుంటుందీ అని! ఆ అయిడియా మిగతా నలుగురికీ నచ్చింది. నాకు నచ్చకపోయినా అర్జెంగీ కారాప్ని తెలియచేశాను మవునంగా కూచుని. కారు రాజాగారి తోటకెళ్లి ఆగింది అక్కడ...అక్కడ...'

సుజాత మళ్లీ మగతలోకి జారిపోయింది. నర్సు మరో ఇంజక్షను నివ్వబోయేంతలో తేరుకుంది.

'అన్నయ్యా! యముళ్లెందరు?'

'ఇప్పుడెందుకమ్మా ఆ గొడవ?'

'కావాల్లే చెప్పన్నయ్యా!'

'ఒక్కరే!'

'మరి నాకు అయిదుగురు కన్పిస్తున్నారేం!? అవునన్నయ్యా: అడుగో ఒక యముడు...నాదగ్గర కొచ్చి యీా చేయి కదలకుండా పట్టుకున్నాడు. మరొక యముడు యీా చేయి గట్టిగా పట్టుకున్నాడు. మిగతా ముగ్గుర్లో యిద్దరు నా కాళ్లు పట్టుకున్నారు. అయిదోనాడు. అన్నా... నా క్లాస్‌మేట్ నరోత్తమరావులా వున్నాడే...అవును అతడే...ఎంతో దయతో నన్ను కారెక్కనిచ్చినవాడు అంతక్రూరంగాచూస్తున్నాడేవిటీ...అయ్యో పైపైకి వచ్చేస్తున్నాడు...నరోత్తమరావ్! ఏమిటిది? ఏం చేయాలనుకుంటున్నావ్? షికారని యిక్కడికి తీసుకొచ్చింది యిందుకా! ప్రజలకు...ముఖ్యంగా దుఃఖిత ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన పెద్దమనిషి హరిశ్చంద్రరావు బావమరదివి...అతడు ప్రాతినిధ్యం వహించేందుకు పీడితులెవరూ దొరక లేదా...యీా దురాగతానికి పూనుకుని నన్ను పీడిస్తున్నావ్! వద్దు...ప్లీజ్...నేను నీ చెల్లెలిలాటి దాన్ని...నన్నేం చేయకు...నీ కాళ్లు పట్టుకుంటా... బుద్ధి గడ్డితిని నీ కారుకేసి అలా చూశాను. ఏదో మగపురుగు 'అయి'నయిపోయి నన్ను కార్లో వూరేగిస్తుందనే అలా చూశానుగాని యీా మగపురుగు యింత విషపు కాటు వేయగలిగినదని తెలిసికాదు. కాని యిప్పుడు తెల్సుకున్నాను. యిహ నీ కారు చాయలకి రాను. యీా తప్పు మరోసారి చేయను... నన్ను క్షమించు నరోత్తమరావ్...నా జీవితంలో నిప్పులు పోయకు...నా బ్రతుకు బజారుకీడ్చకు... రాకు...రాకు...అలా పైపైకి రాకు...అయ్యో వినవా...నా మాట వినవా......అన్నలారా......మీరూ నా మాట వినరా...నేను మీ చెల్లెల్ని...నన్ను రక్షించరా...నవ్వుతున్నారా...నవ్వండి.. బాగా నవ్వండి... నాలుగుపాదాల నడవవలసిన ధర్మాన్ని అయిదు జతల పాదాలతో అణగ త్రొక్కుతున్న విజయగర్వంతో నవ్వండి. నేనుమాత్రం ఏడుస్తుంటాను......ఏడుస్తుం...అమ్మా!!!'

'బేబీ!!'

* * *

సుజాత దుర్మరణానికి కారకుడైన నరోత్తమ రావుని సుబ్బారావు చిత్రవధ చేసేడా? తనుగా ఆపని చేయలేక అతగాణ్ణి చట్టానికి అప్పగిద్దాం అనుకున్నాడా?? అలా అనుకున్న మరుక్షణంలో 'అయ్యో డబ్బు కక్కుర్తిపడి ఆ వెధవ మ్యాడ్రో జాలుగా యిదే హాస్పిటల్లో వున్నాడని దొంగ సర్టిఫికెట్టిచ్చి, వాణ్ణి చట్టానికి అప్పగించే అవకాశాని పోగొట్టుకున్నానే' అని వాపోయేడా??

లేక...తను చిన్నతనంలో చదువుకున్న ఈగల పాఠం—అదే...'ఈగలను మనము తినుపదార్థములపై వాలనీయరాదు. ఏలననగా ఈగలు అంతకుముందే

రోగుల పుళ్లమీదా, కళ్లమీదా వాలివుండవచ్చును. అట్లువాలిన ఈగలకాళ్లకు రోగక్రిము లంటుకొనును. ఆ ఈగలు మరల మనము తినుపదార్థములమీద వాలి నప్పుడు వాటికాళ్లవంటిపెట్టుకునియున్న రోగక్రిములు పదార్థములమీద చేరును. ఆ పదార్థములు తినినచో మనకూ ఆ రోగములు వచ్చు ప్రమాదము ఎంతైనా కలదు'—అన్న ఈగలపాఠం జ్ఞాపకం వచ్చి 'హవును! కోరికలతో వేగిపోతున్న సుజాత ఆలోచన్లమీద సుందరిలాటి ఈగలు వాలినై. ఎవరెవరి కోరికలు ఎక్కడ ఎంత తేలిగ్గా తీరాయో చూసొచ్చి ఉదాహరణలతోసహా సుజాతకి చెప్పినై. సుజాత వాటికి లొంగి యిలా కుంగిపోయింది. అలాగే ఏ పక్కింటి ఈగో, ఎదురింటి ఈగో సుభద్ర ఆలోచన్లమీద వాలి అంచాలు తిని బలసి పందిరి మంచాలమీద పవ్వళిస్తున్న వారిగురించి చెప్తుంటుంది—అందుకే అది అలా తయారైంది. చివరికి అదికూడ ఒక ఈగగా మారిపోయి నా మనసుని కూడా కలుషితం చేసింది—ఫలితం అందరం అనుభవిస్తున్నాం. ఇందులో విడ్డూరమేమీలేదు!!' అని సరిపెట్టుకున్నాడా??

అదీగాకపోతే, న్యాయం చేతిలో అన్యాయం వోడటమన్నది అతిసహజమైన విషయం కాని అన్యాయాలకు అధిపతి అయిన హరిశ్చంద్రరావు తల పెట్టిన అన్యాయం చేతిలో నేను చేసిన యింత చిన్నతప్పు వోడిపోయిందేమిటా (!) అని ఆశ్చర్య పోయేడా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు వెండితెరమీద చూడక్కర్లేదు—గుండె తెరమీద చూసుకుంటే చాలు.

---

